## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పిట్లం, అక్టోబర్ 18: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పిట్లం సర్పంచ్ విజయలక్ష్మి గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో అదనంగా కూలీలను నియమించి పారిశుద్ధ్య పనులను చేపడుతున్నారు. పనులను పంచాయతీ కార్యదర్శి యాదగిరి బుధవారం పర్యవేక్షించారు. ఇంట్లో పోగుచేసిన చెత్తను ఇంటి వద్దకు వచ్చే గ్రామ పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్‌కు అందించాలని సూచించారు. గ్రామ శుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

## తహసీల్దార్ ఎదుట 17 మంది బైండోవర్

గాంధారి, అక్టోబర్ 18: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గాంధారి తహసీల్దార్ జానకి ఎదుట 17 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 సంవత్సరంలో నిర్వహించిన ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకొని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 17 మందిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న అధికారులు

డోంగ్లీ, అక్టోబర్ 18: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన సదస్సులో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుష్ఠువ్యాధి నివారణ బృందం రాష్ట్ర డీపీఎంవో సకలారెడ్డి మాట్లాడారు. చర్మం మొద్దుబారినా, చర్మంపై మచ్చలు ఏర్పడినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పీహెచ్‌సీలో కుష్టువ్యాధికి సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కుష్టురోగులపై వివక్ష చూపొద్దన్నారు. సదస్సులో డీపీఎంవో రాధాకృష్ణ, ఏపీఎంవో జీవన్, వైద్యాధికారి నాగ గిరీశ్, సిబ్బంది ప్రవీణ్, రవి, మంజుల, ఏఎన్ఎం శోభ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న గడీల భాస్కర్

సదాశివనగర్, అక్టోబర్ 18: మండలంలోని కుప్రియాల్ గ్రామానికి చెందిన మంగలి రాములు కూతురు హేమలత పెండ్లికి రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ గడీల భాస్కర్ రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశాడు. పేదింటి ఆడబిడ్డ పెండ్లికి తనవంతు ఆర్థిక సహాయం చేశానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు సాయిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గడ్డం బాపురెడ్డి, బాణాల వెంకట్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కలాలీ చుక్క సాయాగౌడ్, చాకలి లింగం, కాటిపల్లి హన్మంత్ రెడ్డి, పాములు అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి ఆదర్శ కాలేజీ వద్ద వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారులు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జోనల్ అధికారి నారాయణ

# పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు సిద్ధంగా ఉంచాలి

**ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్**

ఎల్లారెడ్డి/ ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 18: పోలింగ్ కేంద్రాలను అన్ని రకాల సౌకర్యాలతో ఎన్నికలకు సిద్ధంగా ఉంచాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నియోజక వర్గస్థాయి సెక్టార్ అధికారులతో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి సెక్టార్ అధికారి తనకు కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వాటి పరిస్థితిపై నివేదిక తయారు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులైన తాగునీరు, ఫర్నిచర్, ర్యాంప్, మరుగుదొడ్లు, ప్రహరీ, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించాలన్నారు. నివేదికను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలని సూచించారు. సమావేశంలో ఆయనతోపాటు తహసీల్దార్ సురేశ్, నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

***పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన..***

అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను జోనల్ అధికారి నారాయణ పరిశీలించారు. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలు, మున్సిపాలిటీ ప్రాంగణంలో ఉన్న రెండు కేంద్రాలు, జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఉన్న రెండు కేంద్రాలు, దేవునిపల్లి, అచ్చయపల్లి, మల్లయపల్లి, మాచాపూర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి అక్కడ ఉన్న వసతులను ఆయన తెలుసుకున్నారు.

***వసతి గృహాల పరిశీలన..***

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివిధ పోలీసు బలగాల అవసరాల కోసం పట్టణంలోని పలు వసతి గృహాలను స్థానిక ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వచ్చే పోలీసుల వసతి కోసం ఆదర్శ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఉన్న బాలికల వసతి గృహాన్ని, పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని, బీసీ బాలికల వసతి గృహాలను వారు పరిశీలించారు. వారి వెంట స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, తహసీల్దార్ సురేశ్ ఉన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం




మండల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దకొడప్‌గల్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

పెద్ద కొడప్‌గల్, అక్టోబర్ 18: పెద్దకొడప్‌గల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించగా.. పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. పెద్ద కొడప్‌గల్ సర్పంచ్ తిర్మల్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్దకొడప్‌గల్, బేగంపూర్, పోచారం తండా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. సమస్యను మూడు రోజుల్లో పరిష్కరిస్తామని మిషన్ భగీరథ డీఈ కౌశిక్ తెలిపారు. పత్తికి చీడపీడలు ఆశించి నష్టపోతున్నామని, వ్యవసాయాధికారులు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ దశరత్, ఎంపీడీవో రాణి, బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, వైస్ చైర్మన్ కండే రావు, వైస్ ఎంపీపీ లక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దొంగను పట్టుకున్న పోలీసులు



దుంగడుగు ధ్వంసం చేసిన గొళ్లెం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 18: పోస్టాఫీస్ తలుపు తెరిచి చోరీ చేసేందుకు యత్నించిన దుండగున్ని పోలీసులు పట్టుకున్న ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో చోటుచేసుకున్నది. ఏఎస్సై నర్సింగ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రాత్రి రెండు గంటల సమయంలో డయల్ 100కు వచ్చిన సమాచారంతో పోస్టాఫీస్ వద్దకు పోలీసులు వెళ్లారు. అక్కడ ఎల్లారెడ్డి మండలంలోని భిక్నూర్‌కు చెందిన బంగారుగళ్ల మహేశ్ పోస్టాఫీస్ తలుపులు తెరిచేందుకు యత్నిస్తున్నాడు. దీంతో అతడిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్సై నర్సింగ్‌రావు తెలిపారు. దుండగుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఏఎస్సై నర్సింగ్‌రావు, నరేందర్, కానిస్టేబుల్ సిద్ధు పెట్రోలింగ్ నిర్వహించిన వారిలో ఉన్నారు.

## కలప తరలిస్తున్న వాహనం సీజ్

రామారెడ్డి, అక్టోబర్ 18: అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీ శాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తోకల ప్రభాకర్ తన బొలేరో వాహనంలో మామిడి దుంగలను అనమతి లేకుండా తరలిస్తున్నాడు. తమకు అందిన సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశామని ఎఫ్‌బీవో శ్రీధర్ తెలిపారు.

# నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల నిలిపివేత



నిజాంసాగర్ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రం నాటి నీటిమట్టం

నిజాంసాగర్, అక్టోబర్18: నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న పంటల కోసం కొనసాగిన నీటి విడుదలను మంగళవారం రాత్రి నిలిపివేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ శివకుమార్ బుధవారం తెలిపారు. ఆయకట్టు కింద అలీసాగర్ వరకు సాగు చేస్తున్న పంటలకు సాగు నీరు చివరి తడి అవసరం ఉన్నదన్నారు. దీంతో పదిహేను రోజులుగా నీటి విడుదలను కొనసాగించామని చెప్పారు. ప్రస్తుతం పంట చేతికి వస్తున్నదని, దీంతో నీటి అవసరం లేకుండా పోయిందని, అందుకే నీటి విడుదలను నిలిపివేశామని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405.00 అడుగులు (17.80 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1404.56 అడుగులు (17.16 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని శివకుమార్ తెలిపారు.

# డ్రోన్ ద్వారా రసాయన మందు పిచికారీపై అవగాహన అవసరం

**సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్**

సదాశివనగర్, అక్టోబర్ 18: భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతులకు డ్రోన్ ద్వారా రసాయన మందుల పిచికారీపై బుధవారం అవగాహన కల్పించారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్, అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్రిమి సంహారక, రసాయన ఎరువులు డ్రోన్ ద్వారా ఎలా పిచికారీ చేయాలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ సదాశివారెడ్డి, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం ద్వారా సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతో సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఎకరా పొలానికి డ్రోన్ ద్వారా ఐదారు నిమిషాల్లో మందు పిచికారీ చేయొచ్చని తెలిపారు. రైతుకు తక్కువ శ్రమతో ఎక్కువ లాభం పొందే వీలుంటుందని అన్నారు. ఏఈవో శ్రీనివాస్ రెడ్డి, రైతులు గంగసాని సాగర్‌రెడ్డి, పయ్యావుల రాజేశ్వర్, చిన్న నర్సింహులు, ఎర్ర నర్సారెడ్డి, కొండి కొండల్ రెడ్డి, తెనుగు సుధాకర్, పయ్యావుల నర్సింహులు, డ్రోన్ కంపెనీ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



అడ్లూర్ ఎల్లారెడ్డిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ బాధ్యులు, అధికారులు